మ్యాన్‌హోళ్ల నుంచి బ్లాంకెట్లు.. బెడ్‌షీట్లు!

- నల్లగొండ చౌరస్తా వద్ద డీ-సిల్టింగ్‌లో వెలికితీత
- రెండో సారీ పునరావృతమైన సమస్య
- అవగాహన కల్పించినా మారని తీరు
- వ్యర్థాలు వేస్తే వాటర్‌బోర్డు కఠిన చర్యలు

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): మానవ మల, మూత్రాలను మోసుకెళ్లే సీవరేజీ లైన్లలో కొందరూ బ్లాంకెట్లు, బెడ్‌షీట్లు వేస్తున్నారు. అంతేకాదు.. దిండులు కూడా పడేస్తున్నారు. దాంతో సీవరేజీ లైన్లలో మురుగు ప్రవాహ వ్యవస్థకు బ్లాంకెట్లు, బెడ్‌షీట్లు అడ్డుగా మారుతున్నాయి. సీవరేజీ లైన్లలో మురుగు ప్రవహించకుండా రోడ్లపై పరుగులు తీస్తోంది. గతంలో వాటర్‌బోర్డు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో డీ సిల్టింగ్ పనులు చేపట్టిన సందర్భంలో బ్లాంకెట్లు, బెడ్‌షీట్లు వెలికితీయడంతో పాటు స్థానికులకు అవగాహన కల్పించారు. అయినా కానీ ఎలాంటి మార్పు రాలేదు. ఇష్టానుసారంగా సీవరేజీ లైన్లలో ఘన పదార్థాలు, బట్టలు, ఇతరతర వ్యర్థాలను నగరవాసులు పడేస్తున్నారు.

రియాసత్‌నగర్ పరిధిలోని మలక్‌పేట్, నల్గొండ చౌరస్తాలో సీవరేజీ ఓవర్‌ఫ్లోను అధికారులు అరికట్టారు. జెట్టింగ్ యంత్రాన్ని ఉపయోగించి సిల్ట్‌ను బయటికి తీసి మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చేశారు. ఈ ప్రాంతాల్లో తరుచూ సీవరేజీ ఓవర్ ఫ్లో ఫిర్యాదులు నమోదు కావడంతో అధికారులు డీ- సిల్టింగ్ పనులు చేపట్టారు. అయితే మ్యాన్‌హోళ్లలో నుంచి బ్లాంకెట్లు.. బెడ్‌షీట్లు, బట్టలు, ప్లాస్టిక్ వస్తువులు ఇతర ఘన పదార్థాలను గుర్తించారు. ఆ కారణంగా ఆ ప్రాంతంలో సీవరేజీ ఓవర్ ఫ్లో అవుతున్నట్టు గుర్తించారు. వాస్తవానికి స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఇక్కడ డీ-సిల్టింగ్ పనులు నిర్వహించి సిల్ట్ అంతా తొలగించారు. కానీ మళ్లీ అందులో వ్యర్థాలు వేయడం వల్ల అది పేరుకుపోయి మళ్లీ ఓవర్ ఫ్లో అయింది.



మ్యాన్‌హోళ్ల నుంచి బయటికి తీసిన సిల్ట్



జెట్టింగ్ యంత్రాన్ని ఉపయోగించి సిల్ట్‌ను మ్యాన్‌హోళ్ల నుంచి బయటికి తీస్తున్న దృశ్యం



మ్యాన్‌హోళ్ల నుంచి బయట పడ్డ బ్లాంకెట్లు, బెడ్‌షీట్లు

వ్యర్థాలు వేస్తే ఇక కఠిన చర్యలు

కొందరూ నగరవాసుల అవగాహన లేమితో సీవరేజీ ఓవర్‌ఫ్లో సమస్యలు మళ్లీ ఉత్పన్నమవుతున్నాయి. మ్యాన్‌హోళ్లలో బ్లాంకెట్లు, బెడ్‌షీట్లు, ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, వాటర్ బాటిళ్లు, ఘన పదార్థాలు లాంటి వ్యర్థాలు వేస్తున్నారు. ఒకానొక దశలో అయితే మ్యాన్‌హోళ్ల నుంచి దిండ్లు, పరుపులు తీసిన ఘటనలున్నాయి. ఇదే కాకుండా.. హోటళ్లు, కార్యాలయాలు, బేకరీలు, ఫుడ్ కోర్టులు, వాణిజ్య భవనాల యజమానులు, బహుళ అంతస్తు భవన సముదాయాల నిర్వాహకులు.. తమ సీవరేజీ పైపులైన్ నేరుగా వాటర్‌బోర్డు సీవరేజీ నెట్‌వర్క్‌కు అనుసంధానం చేయడంతో వాటి నుంచి వచ్చే ఆహార, వ్యర్థ పదార్థాలు మ్యాన్‌హోళ్లలో చేరుతున్నాయి. సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోకపోవడం వల్ల కూడా ఈ సమస్య వస్తుంది. ఫలితంగా సీవరేజీ పైపులైన్లపై ఒత్తిడి పెరిగి అవి ఓవర్‌ఫ్లో అవుతున్నాయి. నగరవాసులకు అవగాహన, సరైన సహకారం లేకుండా ఎన్ని స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టినా ప్రయోజనం ఉండదని, ఇక నుంచి ఎవ్వరైనా మ్యాన్‌హోళ్లలో చెత్త, వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వాటర్‌బోర్డు అధికారులు హెచ్చరించారు. హోటల్స్ సిల్ట్ ఛాంబర్లు ఏర్పాటు చేసుకుంటే.. ఘన వ్యర్థాలు అందులోనే ఆగి మ్యాన్‌హోళ్లలోకి మురుగునీరు మాత్రమే ప్రవహిస్తుందని, అర్హులైన వారు సిల్ట్ ఛాంబర్లను నిర్మించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



చెరువులో కలుషితమవుతున్న నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

పెద్దచెరువులో మురుగునీరు కలవకుండా చూడండి

మన్సూరాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ పెద్దచెరువులో మురుగునీరు కలవకుండా జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూ అండ్ ఎస్‌బీ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి మార్నింగ్‌వాక్‌లో భాగంగా శుక్రవారం మన్సూరాబాద్ పెద్దచెరువును పర్యవేక్షించిన ఆయన అందులో మురుగునీరు కలవడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతల్‌కుంట అండర్పాస్ రోడ్డులో వర్షపునీరు నిల్వకుండా ఎస్ఎన్ఆర్ అపార్ట్‌మెంట్ రోడ్డు మార్గం గుండా పెద్దచెరువులో కలిసేలా ప్రత్యేకంగా నాలాను నిర్మించడం జరిగిందన్నారు. కాగా ఆ నాలా పైప్‌లైన్‌కు కొన్ని సీవరేజీ లైన్లు కలవడంతో చెరువులోని నీరు కలుషితమవుతోందని, వెంటనే నాలాకు కలిపిన సీవరేజీ లైన్లను తొలగించి చెరువునీరు కలుషితం కాకుండా జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పరిసర ప్రాంతవాసులు శేఖర్‌రెడ్డి, వేమన్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, బీజేపీ నాయకులు మొరిశెట్టి సంతోష్‌కుమార్, కవితారెడ్డి పాల్గొన్నారు.



బడిబాటలో భాగంగా ఇంటింటి ప్రచారం చేస్తున్న జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు

బాటసింగారంలో బడిబాట

అబ్దుల్లాపూర్‌మెట్, మే 16(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామంలో శుక్రవారం జడ్పీహెచ్ఎస్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం యాదగిరి, ప్రైమరి స్కూల్ హెచ్ఎం సంతోష గ్రామంలో తిరిగి బడి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్ప, పార్వతి, శ్రీలత, ప్రతాప్, శోభారాణి, మాజీ సర్పంచ్ లతాశ్రీగౌరిశంక్‌చారి, గోపీ, వెంకటేష్, నీవ్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నరాజుకు అవార్డు అందజేస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, దైవజ్ఞశర్మ

పొదిలి చిన్నరాజుకు దాసరి నారాయణరావు అవార్డు

సైదాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): సమాజసేవలో సైదాబాద్‌కు చెందిన ఆయుర్వేద వైద్యుడు పొదిలి చిన్నరాజు దర్శకరత్న డా. దాసరి నారాయణరావు ఇంటర్నేషనల్ అవార్డును అందుకున్నారు. త్యాగరాయగానసభలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, దైవజ్ఞశర్మలు అవార్డును అందజేశారు. పేదలకు అందిస్తున్న ఉచిత వైద్యం వృద్ధులకు ఆసరాగా ఉంటూ సేవ చేస్తున్న చిన్నరాజును గుర్తించి అవార్డు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను కలిసి అభినందించారు.



త్రినేత్ర ఆంజనేయస్వామి జాతర ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న టీపీసీసీ మాజీ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్‌గౌడ్

కనులపండువగా త్రినేత్ర ఆంజనేయస్వామి జాతర

వనస్థలిపురం, మే 16(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని ప్రసిద్ధ త్రినేత్ర ఆంజనేయ స్వామి జాతర ఉత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం టీపీసీసీ రాష్ట్ర మాజీ కార్యదర్శి ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలందరూ ఐక్యమత్యంతో జాతర ఉత్సవాలను నిర్వహించుకోవడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ముద్దగౌని చంద్రకాంత్‌గౌడ్, వెంకట్రావ్, కృష్ణగౌడ్, మనీష్‌గౌడ్, నాగరాజు, మహేష్ పాల్గొన్నారు.



బ్యాట్మింటన్ కోర్టును ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

క్రీడలతో శారీరక మానసికోల్లాసం

మన్సూరాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసంతో పాటు శారీర దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని టీపీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడలోని సహభావన టౌన్షిప్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టును శుక్రవారం ఉప్పల ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఫణికుమార్, నరేష్, ప్రగతి, చైతన్య, శరత్, నాగరాజు, విష్ణు, ప్రకాశ్, అభి, రాజేందర్ రెడ్డి, ఢిల్లీ నరేష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జిమ్ పరికరం మీదపడి బాలుడు మృతి



నిఖిల్(ఫైల్)

సరూర్‌నగర్ : ప్రమాదవశాత్తూ జిమ్ పరికరం మీద పడడంతో గాయాలపాలై ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మీర్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లెలగూడలోని దాసరినారాయణ కాలనీకి చెందిన నిఖిల్(5) గురువారం సాయంత్రం తోటి పిల్లలతో కలిసి మంత్రాలచెరువు సమీపంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో పార్కు పక్కన ఉన్న ఓపెన్ జిమ్‌లోకి వెళ్లిన బాలుడు అక్కడి ఎయిర్ స్వింగ్ అనే జిమ్ పరికరంతో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తూ దానికి ఉన్న ఇనుప కడ్డీ బాలుడి మీద పడింది. దాంతో తీవ్ర గాయాలపాలైన నిఖిల్‌ను సంతోష్‌నగర్‌లోని ఒవైసీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. బాలుడి తండ్రి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా ఓపెన్ జిమ్ నిర్వహణలోని లోపాల వల్లనే తమ బాబు ప్రమాదానికి గురై మరణించాడని నిఖిల్ కుటుంబ సభ్యులు ఆరోపించారు.



డెంగీ నివారణపై అవగాహన ర్యాలీలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ నివారణ

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే డెంగీ వ్యాధిని నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ విధిగా తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్బీనగర్ చౌరస్తా నుంచి చింతల్‌కుంట వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే డెంగీ వ్యాప్తి, నివారణ వంటి అంశాలపై ఎంటమాలజీ అధికారులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ నిర్దిష్టమైన చికిత్స లేని డెంగీ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే అది ప్రాణసంకటంగా మారుతోందని, ఈ వ్యాధిని ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా ఎలాంటి అనుమానం ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవరెడ్డి, అసిస్టెంట్ ఎంటమాలజిస్టు రాంబాబు, మణి, రవీంద్రనాథ్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, రుద్ర యాదగిరినేత, సింగిరెడ్డి వేణు, ఎల్బీనగర్ జోనల్ పరిధిలోని ఎంటమాలజీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఓల్డ్‌మలక్‌పేటలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న యూపీహెచ్‌సీ సిబ్బంది

డెంగీ రహిత నగర నిర్మాణానికి పాటుపడదాం: నర్సింహారెడ్డి

దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ విధిగా ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని డెంగీ రహిత నగర నిర్మాణానికి పాటుపడదామని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ నివారణ రోజును పురస్కరించుకుని శుక్రవారం ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తా, మన్సూరాబాద్ చంద్రపురికాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన డెంగీ నివారణ అవగాహన ర్యాలీ, సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో చంద్రపురి, సూర్యోదయనగర్, సరస్వతీనగర్ కాలనీల అధ్యక్షులు వెంకటిరెడ్డి, సోమిరెడ్డి, వేమారెడ్డి, బీజేపీ నాయకులు, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓల్డ్‌మలక్‌పేట : దోమలను నివారించడం వల్ల డెంగీ, మలేరియా వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని హైదరాబాద్ జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బ్రిజిస్‌ఉన్నీసా ప్రజలకు సూచించారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓల్డ్‌మలక్‌పేటలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల వల్ల వచ్చే వ్యాధులు, దోమలు పుట్టకుండా, కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో మలక్‌పేట అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది రామేశ్వరి, మల్లికార్జున్, నీలిమ, జయ, కవిత పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో ఉచిత వైకుంఠ రథాలు

- రూ.43లక్షలతో రెండు వాహనాల కొనుగోలు
- అంతిమ యాత్రకు వినియోగించుకోండి : కమిషనర్

సరూర్‌నగర్, మే 16(ఆంధ్రజ్యోతి): ఎవరైనా మరణించినప్పుడు వారిని ఆఖరి మజిలీకి తీసుకెళ్లడానికి సమయానికి వాహనాలు లభించక మృతుల కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి వారి ఇబ్బందులు దూరం చేసే లక్ష్యంతో బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు మృతుల అంతిమ యాత్రకు ఉచిత వాహన సదుపాయాన్ని కల్పిస్తున్నారు. ఇందుకుగాను ఇటీవల రూ.43లక్షలు వెచ్చించి కార్పొరేషన్ తరఫున రెండు వాహనాలు కొనుగోలు చేసి, వాటిని వైకుంఠ రథాలుగా మార్చారు. వాటికి అవసరమైన ఎక్స్‌ట్రా ఫిట్టింగ్స్ వగైరా పూర్తి చేయించి శుక్రవారం నుంచి మునిసిపల్ కార్యాలయంలో అందుబాటులో ఉంచారు.

పూర్తిగా ఉచితం : కమిషనర్ సరస్వతి వెల్లడి

బడంగ్‌పేట్ కార్పొరేషన్ తరఫున కొనుగోలు చేసిన రెండు వైకుంఠ రథాలు పూర్తిగా ఉచితంగా వినియోగించుకోవచ్చునని, ఎలాంటి ఫీజు ఉండదని కమిషనర్ పి.సరస్వతి తెలిపారు. 'ముందు వచ్చిన వారికి ముందు' పద్ధతిలో వాహనాల కేటాయింపు ఉంటుందని, మృతుల కుటుంబ సభ్యుల సంఖ్యను బట్టి చిన్న వాహనంగానీ, పెద్ద వాహనంగానీ వినియోగించుకోవచ్చునని ఆమె పేర్కొన్నారు. బుకింగ్ కోసం ఫోన్ నం.9849175575లో సంప్రదించాలని ఆమె సూచించారు.



బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో అందుబాటులో ఉన్న వైకుంఠ రథాలు

విద్యుత్ వైర్ల ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలి

చంపాపేట, మే 16(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని సాయిరాంనగర్ కాలనీలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కర్మన్‌ఘాట్ చౌరస్తాలో కొలీషియం మాల్ వరకు ఏర్పాటు చేయనున్న హైటెన్షన్ విద్యుత్ వైర్ల ఏర్పాటు ఆలోచనను విద్యుత్ అధికారులు విరమించుకోవాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆయా కాలనీల ప్రతినిధుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కార్పొరేటర్ డివిజన్‌లోని న్యూ పద్మానగర్‌కాలనీ, సాయిరాంనగర్‌కాలనీ, ప్రెస్‌కాలనీ, మల్‌రెడ్డి రంగారెడ్డినగర్‌కాలనీ, ఉదయ్‌నగర్‌కాలనీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సబ్‌స్టేషన్ నుంచి కొలీషియం మాల్ వరకు రెండు కిలోమీటర్ల పొడవునా హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయడం వల్ల కాలనీల ప్రజలకు ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. కొలీషియం మాల్‌కు అర కిలోమీటర్ దూరంలో ఉన్న బైరామల్‌గూడ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కనెక్షన్ పొందితే తమకు అభ్యంతరం లేదని అన్నారు. విద్యుత్ అధికారులు హైటెన్షన్ విద్యుత్ వైర్ల కోసం దిమ్మెలను ఏర్పాటు చేయవద్దని డివిజన్ ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌కు కార్పొరేటర్ సూచించారు. విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే స్థానిక ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేయనున్నట్లు కార్పొరేటర్ హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు సందీప్‌రెడ్డి, దశరథ్‌గౌడ్, వీరారెడ్డి, వేణుగౌడ్, ఆయా కాలనీల ప్రతినిధులు అలంపల్లి శ్రీనివాస్, వెంకటేష్, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఆనంద్ రెడ్డి, నాగేష్‌గుప్తా, నారాయణరెడ్డి, జయవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



హైటెన్షన్ విద్యుత్ వైర్ల కోసం ఏర్పాటు చేసిన దిమ్మె వద్ద ఆందోళన చేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

బాలిక అదృశ్యం

సైదాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు మాదన్నపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మాదన్నపేట జవహర్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న సోఫియా బేగం(16) తల్లి చిన్నప్పుడే మృతిచెందడంతో యాఖత్‌పురాలోని బంధువు సబా తహ్సీన్ పోషిస్తుంది. గురువారం ఉదయం సోఫియా బ్యాగు తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం వెతకగా తెలియక పోవడంతో పోలీసులను ఆశ్రయించారు. మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సోఫియాబేగం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట, మే 16(ఆంధ్రజ్యోతి): చంపాపేట విద్యుత్ 11కేవీ ఫీడర్‌లో వివిధ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9:30గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డివిజన్ ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని సాయిరాంనగర్‌కాలనీ, శిఖరా ఎన్‌క్లేవ్, నాగార్జునకాలనీ, ఆర్టీసీకాలనీ, భానునగర్, కేశవనగర్, సింగరేణికాలనీ, రాఘవేంద్ర కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

11కేవీ శ్రీనివాసనగర్ ఫీడర్‌లో..

చంపాపేట విద్యుత్ సెక్షన్‌లోని 11కేవీ శ్రీనివాసనగర్ ఫీడర్‌లో శనివారం సాయంత్రం 3:30గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని గ్రీన్‌పార్కుకాలనీ, శ్రీనివాసనగర్‌కాలనీ, సాయిరాంకాలనీ, తపోవన్‌కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

11కేవీ లైన్‌లో..

11కేవీ రియల్ బేకరీ విద్యుత్ ఫీడర్‌లో శనివారం వివిధ మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఫీడర్ పరిధిలోని ఉదయ్‌నగర్, పద్మానగర్, గాయత్రీనగర్ ఎక్స్‌రోడ్, మందమల్లమ్మ ఎక్స్‌రోడ్, కర్మన్‌ఘాట్, నిర్మలానగర్ కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో..

సంతోష్‌నగర్, మే 16(ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ గౌరెల్లి, లక్ష్మిగణపతి, ఎల్బీనగర్, సిరీస్, ఇందిరనగర్, హనుమాన్‌నగర్, సాయినగర్, గోటెట్టిఫంక్షన్‌హాల్, మోహన్‌నగర్, ఆర్‌కెపురం ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో నిర్వహణ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ తెలిపారు. 11కేవీ గౌరెల్లి, లక్ష్మిగణపతి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు, 11కేవీ ఎల్బీనగర్, సిరీస్, ఇందిరనగర్, హనుమాన్‌నగర్, సాయినగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు, 11కేవీ గోటెట్టిఫంక్షన్‌హాల్, మోహన్‌నగర్, ఆర్‌కెపురం ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర : పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. ఉప్పుగూడ - యాకత్‌పుర రైల్వే స్టేషన్ల నడుమ 35ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహం పక్కన చిత్తుకాగితాల బస్తా ఉంది. చిత్తు కాగితాలు ఏరుకునే వ్యక్తి అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.